క్లుప్తంగా

ట్రాఫిక్ ఎస్‌ఐగా ఎర్రన్న



ఎమ్మిగనూరురూరల్: పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐగా ఎర్రన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న ఈ స్థానానికి కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఎర్రన్నకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఆదోని డీఎల్‌పీఓగా తిమ్మక్క



సబ్‌కలెక్టర్‌కు బొకేను అందజేస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

ఆదోని రూరల్: ఆదోని డివిజన్ డీఎల్‌పీఓగా తిమ్మక్క సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

సేవలతోనే గుర్తింపు



ప్రిన్సిపాల్‌కు బొకేను అందజేస్తున్న ఎంఈవోలు

మంత్రాలయం : సేవలతోనే సమాజంలో ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని రిటైర్డు ప్రిన్సిపాల్ కురిడి రమేష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఆయన పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పలువులు విద్యావంతులు రమేష్ దంపుతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు మొయినుద్దీన్, రాఘన్న, లెక్చరర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



శ్రీబాలాజీని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ఇదుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి విద్యార్థి శ్రీబాలాజీ ఎంపికైనట్లు పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఫయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది సునీల్‌రాజ్ కుమార్, రమేష్‌నాయుడు, రాజా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల పరిశుభ్రతే లక్ష్యం



మురుగు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలోని 42 వార్డుల పరిధిలో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటేషన్ అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్. లోకేశ్వరి, కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రధానంగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక, కొబ్బరిబోండాలను శుభ్రం చేసే పనులను పరిశీలించారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

బారికేడ్లు ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని ఢణాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలని డీఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఢణాపురం ఉదయ్ ప్రదీప్ మాట్లాడుతూ గ్రామంలో హైస్కూల్‌కు వందలాది మంది విద్యార్థులు వస్తుంటారన్నారు. రోడ్డు పక్కనే పాఠశాల ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన సబ్‌కలెక్టర్ వెంటనే అధికారులకు తెలియజేసి బారికేడ్లు ఏర్పాటు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు.

నట్టేట మునిగిన రైతులు

- విత్తనాలు, పెట్టుబడులిచ్చి.. దిగుబడులు కొనుగోలు చేస్తామన్న ఓ కంపెనీ ఏజెంట్
- ఆ మాటలు నమ్మి పత్తి సాగు చేసిన రైతులు
- నెల పంట చేతికొచ్చాక పెట్టుబడులు ఇవ్వలేం, పంట కొనలేమని చేతులెత్తేసిన కంపెనీ
- మోసపోయామని మొక్కలను పీకేసిన రైతులు





నక్కలమిట్టలో పత్తి పంటను గొర్రెలకు వదిలేసిన దృశ్యం, పత్తి మొక్కలను పీకేస్తున్న రైతు రంగస్వామి

ఎమ్మిగనూరురూరల్: విత్తనాలు.. పెట్టుబడికి మేమే ఇస్తాం..పంట చేతికి వచ్చాక మేమే కొంటామని సీజ్ కంపెనీ ప్రతినిధులు రైతులకు విత్తనాలు ఇచ్చి, నెల పంట చేతికి వచ్చాక పంటను కొనలేమని చేతులేత్తివేయటంతో పత్తి మొక్కలను పీకేసిన ఘటన సోమవారం ఎమ్మిగనూరు మండలం నక్కలమిట్ట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బజారి, చిన్న రంగస్వామి, పెద్ద రంగస్వామి అనే రైతులు నాలుగు ఎకరాల్లో ఫౌండేషన్ సీజ్ విత్తనాలను కంపెనీ ఏజెంట్ ఇవ్వడంతో సాగు చేశారు. విత్తనం మొదలు పంట చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ. 50 వేలు ఇస్తామని రైతులకు చెప్పటంతో ఆశతో సాగు చేశారు. రైతులు సాగు, కూలీల, మందులకు కలిపి ఎకరాకు రూ. 40 వేల వరకు ఖర్చుచేశారు. ముందుగా చెప్పిన విధంగా పెట్టుబడికి డబ్బులు ఇవ్వాలని రైతులు అడుగుతుండటంతో.. పెట్టుబడికి డబ్బులు ఇవ్వలేము, మీరు పండించిన పంటను కూడా కొనలేమని కంపెనీ వారు చెపుతున్నారని కంపెనీ ఏజెంట్ సమాధానమివ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ ఏజెంట్‌తో వాదనకు దిగితే ఎకరాకు 2 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని కంపెనీ యాజమాన్యం చెప్పిందని, అయితే డబ్బులు ఎప్పుడు ఇచ్చేది గ్యారెంటీగా చెప్పలేమని అంటున్నారని రైతులు చెపుతున్నారు. చెన్నాపురంతో పాటు కోటేకల్, మల్కాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పత్తి విత్తనాలు సాగు చేసినట్లు రైతులు చెపుతున్నారు. మోసపోయామని భావించి చేసేది లేక పత్తి పైరును గొర్రెలకు వదలి, మొక్కలను పీకేస్తున్నారు. ఎకరాకు రూ. 40వేలు పెట్టుబడిన పెట్టినట్లు చెబుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



కంపెనీ వారి మాట విని ప్రత్తివిత్తనాలు సాగుచేస్తే నెల పైరు వచ్చాక ఇప్పుడు డబ్బులు ఇవ్వలేం అని చెబుతునానేర. ఏజెంట్ మాట నమ్మి విత్తనాలు విత్తి ఎకరాకు రూ. 40 వేలు ఖర్చు పెట్టాం. మాకు పరిహారం చెల్లించి, రైతులను మోసం చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. – బజారి, రైతు, నక్కలమిట్ట

మా దృష్టికి రాలేదు

ప్రత్తి పంటను సాగుచేసి ఇప్పుడు కంపెనీ ప్రతినిధులు డబ్బులు ఇవ్వకపోవటంతో పంటలను పీకేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. రైతులు సమస్యను మా దృష్టికి తీసుకువస్తే కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తాం. –శివశంకర్, మండల వ్యవసాయాధికారి

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం నిర్వహించి డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీఓ తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరావు, ఏడీఏ బాలవర్ధిరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఐడీసీ సెంటర్‌తో వేగవంతంగా సేవలు



ఐడీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ అధికారులు

ఆదోని అర్బన్: ఇండియా పోస్టు డెలివరీ వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా ప్రజలకు వేగవంతంగా సేవలు అందించేందుకు ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్, కర్నూలు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోని పోస్టు ఆఫీసు మెయిన్ బ్రాంచిలో ఐడీసీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పోస్టల్ సిబ్బందికి బ్యాగులను పంపిణీ చేసి, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆదోని పట్టణంతోపాటు 15 కి.మీ. పరిధిలో ఉన్న గ్రామాలు ఆరేకల్, బైచిగేరి, ఇస్వీ, మదిరె, జి.హొసళ్లి, దిబ్బనకల్లు, బసాపురం, ఢణాపురం, మూసానపల్లి, మణెకుర్తి, కమ్మరచేడు బ్రాంచి పోస్టు ఆఫీసుల పరిధిలో ఇచ్చే ఉత్తరాలు, పార్సిల్, ఇతర బట్వాడా జరుగుతుందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈఐడీసీ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్టు ఆఫీసర్ శ్రీధర్, పోస్టు మాస్టర్ బద్రి నారాయణ, ఇన్‌చార్జ్ ఐడీసీ రంగముని, సిస్టం అడ్మినిస్ట్రేషన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కి కార్మికుల నిరసన



ఆదోనిలో వాటర్ ట్యాంకుపైకి ఎక్కి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఆదోని టౌన్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం గాంధీ పార్కు వద్ద ఉన్న వాటర్ ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలియజేశారు. కార్మికులు పీరాసాహెబ్, సోమన్న, బషీర్, కరిముల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కంట కన్నీరు తెప్పిస్తున్న సర్కార్

ఎమ్మిగనూరుటౌన్: సమస్యలు పరిష్కరించకుండా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల కంట ప్రభుత్వం కన్నీరు తెప్పిస్తోందని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు రాజేంద్ర,నారాయణ అన్నారు. సోమవారం నాటికి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 55వ రోజుకు చేరుకుంది.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు సైబర్ నేరాలపై వివరిస్తున్న డీఎస్పీ

ఎమ్మిగనూరుటౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి వుండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని గుడ్‌షెఫ్ హైస్కూల్‌లో శక్తిటీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, శక్తియాప్, మహిళలు, విద్యార్థినుల ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. పట్టణ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, శక్తిటీం ఏఎస్ఐ నట్‌రాజ్, కరస్పాండెంట్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావొద్దు

ఆదోని అర్బన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. సోమవారం ఆదోని పట్టణంలోని జ్యోతిర్మయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

జవాన్‌కు న్యాయం చేయాలి



నందవరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గురురాజ్ దేశాయ్

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ షేక్ ఖలీల్ న్యాయం చేయాలని దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జవాన్ ఖలీల్, యువకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. జవాన్ ఖలీల్ మాట్లాడుతూ.. భూ సర్వేలో భూమిని కోల్పోయారని, తిరిగి తన భూమిని రీ సర్వే చేసి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడ్, యువకులు సాధిక్, శివ, అబ్దుల్, సలీం, సుభాన్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

కోసిగి : మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో మండలంలోని పల్లెపాడు, చిన్నభూంపల్లి, కందుకూరు, తుమ్మిగనూరు, అగసనూరు, చిర్తనకల్లు గ్రామాల ప్రజలకు మొహర్రం వేడుకలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంప్రదాయ బద్ధంగా భక్తి శ్రద్ధలతో వేడుకలను జరుపుకోవాలన్నారు.

యువకుడి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణంలోని అబ్బాస్ టాకీస్ సమీపంలో నివాసముంటున్న నరసింహులు కుమారుడు మహేష్(26) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. మందులు వాడినా తగ్గకపోవటంతో సోమవారం సోగనూర్ రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



ఆదోనిలో ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించిన దృశ్యం



నందవరం హెచ్‌ఎం శివరామ్ దంపతులను సన్మానించిన ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కౌతాళం: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని మండల తహసీల్దారు రజినీకాంత్ రెడ్డి, ప్యాపిలి తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మ, ఆస్పరి, హాలహర్వి తహసీల్దార్లు రామేశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన కౌతాళం వీఆర్‌ఓ వేణుగోపాల్‌రావు, ఉప్పరహాల్ వీఆర్‌ఏ పాపమ్మ, ఆఫీస్ సబ్‌ఆర్డినేటర్ సిద్ధమ్మలను స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి సన్మానించారు. ఉప్పరహాల్ వీఆర్‌ఏ పాపమ్మను వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకాంబర్‌రెడ్డి, సర్పంచ్ తులసమ్మ, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి సత్కరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

ఆదోని టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. సోమవారం ఆదోని ఆర్టీసీ డిపోలో పదవీ విరమణ చేసిన డ్రైవర్లు కె.విజయల్‌గౌడ్, వీరేష్, కండక్టర్లు తిమ్మన్న, రంగముని, క్లర్కులకు ఎంఎఫ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సన్మాన నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం పదవీ విరమణ పొందిన డ్రైవర్లు రంగన్న, నరసయ్య, ఆనందరాజు, ఎస్ఎస్ ఈరన్న, బి.రఫీక్, నబిసాబ్‌లను డిపో ఆవరణలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, హెడ్‌క్లర్క్ పంపాపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ అధ్యక్షుడు రుద్ర గౌడ్, పలు యునియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని టీజీఎల్ ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎస్ఎండీ గౌస్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు.



ఎమ్మిగనూరులో ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



పెద్దతుంబళం హెచ్‌ఎం గౌస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నందవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు రామాంజనేయులు, రఘునాథ్ నేతృత్వంలో హెచ్‌ఎం శివరామ్‌కు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎంఈఓలు మధుసూదన్‌రాజు, మొయినుద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- హిందూ శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణ అనుమతి రద్దు చేస్తూ తీర్మానం
- వైఎస్సార్‌సీపీ కౌన్సిర్లు, టీడీపీ నుంచి బీజేపీలో చేరిన కౌన్సిలర్ మధ్య వాగ్వాదం
- చైర్మన్ వారించినా వినని కౌన్సిలర్లు
- సమావేశాన్ని మధ్యలో ముగించిన చైర్మన్



మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో టీడీపీ నుంచి బీజేపీలో చేరిన కౌన్సిలర్‌ను వారిస్తున్న చైర్మన్



బీజేపీలో చేరిన టీడీపీ కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన సోమవారం జరిగిన మున్సిపల్ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో అజెండాలోని 36 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొనడంతో కౌన్సిల్ సభ్యులు అందుకు ఆమోదం తెలిపారు. కాగా అజెండాలోని 31వ అంశంపై వైస్ చైర్మన్ మాట్లాడుతూ గతంలో పనిచేసిన టీపీఓ చేసిన తప్పిదం వల్ల 2023 మార్చి 31న 17వ వార్డు ప్రజల కోసం శ్మశానంలో నుంచి రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. అయితే శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణం వద్దంటూ 22 కులసంఘాల వినతి మేరకు తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆదేశాలతో కౌన్సిల్‌లో వున్న మెజారిటీ వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు నాడు చేసిన తీర్మానాన్ని ప్రస్తుతం రద్దు చేస్తూ తీర్మానిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇటీవల టీడీపీ నుంచి బీజేపీలో చేరిన కౌన్సిలర్ దయాసాగర్ అడ్డు తగిలి నాడు డబ్బు తీసుకొని మీరే తీర్మానం చేశాంటూ ఆరోపించడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నాడు తీర్మానం చేసినప్పుడు మీరు కూడా కౌన్సిల్‌లో వున్నారు కదా.. అప్పుడు ఎందుకు అడ్డుకోలేదు మీకు కూడా డబ్బులు ముట్టాయా అని వైస్ చైర్మన్ ప్రశ్నించారు. అనవసర ఆరోపణలు చేయడం తగదని డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలని హితవు పలికారు.

పార్టీ మారిన కౌన్సిలర్ కండువాపై అభ్యంతరం

దయాసాగర్ ప్రధాని మోదీ గురించి, కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడుతుండగా.. కౌన్సిల్‌లో పట్టణ సమస్యలు చర్చించాలే కాని పార్టీల గురించి కాదని వైస్ చైర్మన్ అడ్డు చెప్పారు. అసలు మీరు బీజేపీ నుంచి గెలుపొంది కౌన్సిలర్ అయ్యారా లేక టీడీపీనా కౌన్సిల్‌లో బీజేపీ కండువా ఎలా కప్పుకొని కౌన్సిల్‌కు ఎలా వస్తారంటూ అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్‌లో బీజేపీ సభ్యులు లేరనిపేర్కొంటూ కూటమిలో వున్న అన్ని పార్టీల కండువాలు వేసుకొని రావాలని పేర్కొనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం తారా స్థాయికి చేరింది. చైర్మన్ కలుగజేసుకున్నప్పటికీ గొడవ సద్దుమణగకపోవడంతో సమావేశాన్ని ముగించారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సమస్యలపై సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇచ్చి వారి పక్షాన పోరాటం చేస్తుందని సమావేశంలో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ చైర్మన్, కమిషనర్ గంగిరెడ్డి దృష్టికి తెచ్చారు. కమిషనర్ జిల్లా కలెక్టర్ దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కరించాలని కోరారు.

పురుగులను నివారించాలి

గోనెగండ్ల : పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో పత్తి పంటలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి చేనులో రసం పీల్చే పురుగులయిన పేను బంక, పచ్చదోమ, తెల్లదోమ ఆశించిన లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. వీటి ఉధృతి అదుపు చేయుటకు ఎకరాకు 60 చొప్పున తెలుపు, పసుపు, నీలం రంగు జిగురు అట్టలను చేనులో అక్కడక్కడ అమర్చాలని సూచించారు. అలాగే మొదటి దశలో వేపనూనె 5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏపీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు.మేళాలో 280 మంది అభ్యర్థులు పాల్గొనగా ఆయా కంపెనీల ఇంటర్వ్యూల్లో 126 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ న్యూటన్ రాజు, సాయితేజ, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌ఐకి సన్మానం



ఎక్సైజ్ ఎస్‌ఐకి జ్ఞాపిక అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి, సిబ్బంది

కోసిగి : కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ నాగరాజు పదవీ విరమణ సందర్భంగా ఎక్సైజ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేపట్టారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఎస్ఐ వీడ్కోలు సభ ను నిర్వహించారు. పోలీస్ శాఖలో 33 సంవత్సరాలు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఎమ్మిగనూరు సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐ రాముడు, కోసిగి ఎస్ఐ కార్తీక్‌సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

జింకల నుంచి పంటలను కాపాడండి

కౌతాళం: జింకల బారి నుంచి రైతుల పంట పొలాలను కాపాడాలని కోరుతూ రైతు సంఘం నాయకులు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మల్లయ్య మాట్లాడుతూ పత్తి మొలకెత్తిన ఐదు ఆరు రోజుల్లోనే జింకలు మొక్కలను తినేస్తున్నాయని, వాటిని కాపాడానికి ఒక మనిషి ప్రత్యేకంగా పొలంలోనే ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో బాష, అయ్యప్ప, ఈరన్న, ఉలిగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని డాక్టర్ అనిల్‌సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మరాఠీగేరిలో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, ఆయాసం, శ్వాస ఆడకపోవడం తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సీతారాముడు, సుబ్బమ్మబాయి, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, ఎలక్ట్రిక్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు భీమేష్, ప్రవీణ్ డిమాండ్ చేశారు. సోమవారం మీటర్ రీడర్లతో కలిసి స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏడీఈకి వినతి పత్రం ఇచ్చారు.

స్కూల్‌ను సీజ్ చేయాలి

గోనెగండ్ల : ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కిన్న జీనియస్ గ్లోబుల్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు నరేంద్ర గౌడ్, సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠలకు వినతిపత్రం అందజేశారు.